తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఓటు అడిగే హక్కు బిజెపికి మాత్రమే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:
రాయలసీమ ప్రాంతంలో అభివృద్ధి మొత్తం మనమే చూస్తున్నాము కాబట్టి ఓటు అడిగే హక్కు ఒక్క బిజెపికి మాత్రమే ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు.ఆదివారం స్థానిక కేశవాయనిగుంటలోని బిజెపి పార్లమెంట్ కార్యాలయంలో రాయలసీమ తూర్పు పట్టభద్రుల నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం తిరుపతిలోని బూత్ ఇన్‌ఛార్జ్‌లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీర్రాజు మాట్లాడుతూ అరాచకం,అవినీతి తప్ప అభివృద్ధి తెలియని వైసిపి పార్టీని,ప్రతిపక్ష టిడిపిలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్న భారతీయ జనతా పార్టీకి మాత్రమే మద్దతు ఇవ్వాలని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని కార్యకర్తలు,నాయకులకు సూచించారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి,సామంచి శ్రీనివాస్,జిల్లా అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి,అజయ్‌కుమార్,వరప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో చెరకు తోట దగ్ధం

నగరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధి నగరిపేట సమీపం హనీఫా సాహెబ్‌కు చెందిన 7 ఎకరాల చెరకు తోట అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా తోటలోనుంచి మంటలు చెలరేగడంతో అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియడం లేదు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి విచ్చేసి మంటలు అదపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే 7 ఎకరాలు పంట అగ్నికి ఆహుతైంది.

# ఘోర రోడ్డుప్రమాదం

లారీని ఢీకొన్న కారు..
ముగ్గురు విద్యార్థులు దుర్మరణం
వేకువజామున ఘటన.. నుజ్జునుజ్జు అయిన కారు
మృతులు నెల్లూరు..అన్నమయ్య జిల్లా వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



మృతిచెందిన శ్రీవికాస్,ప్రవీణ్‌కుమార్, కళ్యాణ్

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త
కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో గుడుపల్లె మండలం శెట్టిపల్లి వద్ద ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థులు, మరో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి రూరల్ సిఐ రియాజ్ అహ్మద్, ఎస్సై రామాంజనేయులు తెలిపిన మేరకు వివరాలిలా.. నెలూరు జిల్లా పెనుంబర్తి గ్రామానికి చెందిన సచీంద్రరెడ్డి కుమారుడు శ్రీవికాస్‌రెడ్డి (21), అన్నమయ్య జిల్లా రెడ్డివారిపల్లికి చెందిన సుబ్బారాయుడు కుమారుడు తలారి ప్రవీణ్‌కుమార్ (24)లు కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో చదువుతున్నారు. వీరిలో శ్రీవికాస్‌రెడ్డి ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ప్రవీణ్‌కుమార్ మూడో సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్నాడు. వీరిలో ఒకరి జన్మదినం నేపథ్యంలో మదనపల్లి మిట్స్‌లో చదువుతున్న వారి బంధువు అయిన రాజ ంపేటకు చెందిన రమణయ్య కుమారుడు కళ్యాణ్ (19) వీరిని కలిశాడు. ఆదివారం వేకువజామున వీరు కారులో కుప్పం వైపు బయలుదేరారు. కారును శ్రీవికాస్‌రెడ్డి నడుపుతున్నాడు. అయితే కారును వేగంగా నడుపుతూ ముందర వెళ్తున్న ఓ లారీని వీరు ముగ్గురు ప్రయాణిస్తున్న కారు ఢీకొందని తెలిపారు. లారీని ఢీకొన్న కారు మరలా కుడివైపు రోడ్డుపై రాగా ఎదురుగా వచ్చిన మరో లారీ ఢీకొందన్నారు. దీంతో సంఘటనా స్థలంలోనే ముగ్గురు విద్యార్థులు మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం రూరల్ సిఐ రియాజ్ అహ్మద్ మృతదేహాలను పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసారు. మృతుల బంధువులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన కుప్పం ఏరియా ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు.

**చంద్రబాబు ప్రగాఢ సంతాపం :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థులు, ఓ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పట్ల తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం తనను కలచి వేసిందని చిన్నవయసులోనే ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు.

## అసమర్ధపాలనతో
# ప్రజలు విసిగిపోయారు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్
30 యేళ్ళుగా గుడిసెల్లో నివసిస్తున్నాం..పట్టాలు లేవు, ఇళ్ళు లేవు
లోకేష్ ఎదుట అచ్చన పూరిగుడిసెల నివాసితులు ఆవేదన



తనపల్లి వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వేని పరిశీలిస్తున్న లోకేష్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:
వైకాపా అసమర్ధ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి, వేజారిపోయి ఉన్నారని, ప్రజలు మార్పును కొరుకొంటున్నారని టిడిపి జాతీయ కార్యధర్శి నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యధర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర టిడిపి తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరు, తనపల్లి, భాగ్యనగరం, కె.సి.పేట, దుర్గసముద్రం మీదగా సాగిన పాదయాత్ర విజయవంతంగా సాగింది. తనపల్లి సమీపంలో కొట్టుకుపోయిన కాజ్‌వే ని లోకేష్ పరిశీలించారు. స్వర్ణముఖి నదీలో రాకపోకలకు నిర్మించిన కాజ్‌వే 2021 వచ్చిన వరదలకు కొట్టుకుపోయిందని, అప్పటినుండి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు లోకేష్‌కు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే వంతేనను పున:నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గత 30 సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్నాం...ఇంతవరకు ఇంటిపట్టాలు, ఇళ్లు లేవని దుర్గసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని అచ్చన ఇళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. కె.సి.పేటలో చేపట్టిన పాదయాత్రలో అచ్చన ఇళ్ళ గ్రామస్తులు లోకేష్ ఎదుట తమ గోడును విన్నవించుకున్నారు. తాము నివసిస్తున్న చోటే పట్టాలు ఇప్పించి, ఇళ్ల నిర్మించి ఇవ్వాల్సిందిగా గ్రామస్తులు కోరారు. అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయిస్తానని, ఆర్భాటపు ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహాన్‌రెడ్డి, అసలైన నిరుపేదలకు మొండి చెయ్యి చూపించారని వాపోయారు. వైకాపా అధికారంలోకి వచ్చాక నిర్మించిన ఇళ్ళు కేవలం 5ఇళ్ల మాత్రమేనని, కేంద్రమంత్రి పార్లమెంట్ సాక్షిగా చెప్పారన్నారు. సెంటు పట్టా పేరుతో సి.యం. జగన్, ఆయన అనుచరులు రూ.7వేల కోట్లు దోచుకుకున్నారని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక, అర్హులందరికి ఇంటిస్థలంతో పాటు ఇళ్ల నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా అచ్చన ఇళ్ల గ్రామస్తులు నివాసముంటున్న ప్రాంతాల్లోనే పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మించి ఇస్తామని స్పష్టం చేసారు. ఈ పాదయాత్రలో టిడిపి జిల్లా ఇన్‌చార్జి పులివర్తి నాని, మాజీ మంత్రి అమర్నాధరెడ్డి, మబ్బు దేవ నారాయణరెడ్డి, అమిలినేని మధు, మునిశేఖర్, క్రిష్ణమూర్తిరెడ్డి, బాలచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, నాగూరు శ్రీనివాసులు, అవిలాల దిలీప్, గోఫి తదితరులు పాల్గొన్నారు.

## అంకుతోటపల్లి వద్ద దారుణహత్య



సంఘటనా స్థలంలో పోలీసులు ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనివాసులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త
అభం శుభం తెలియని పిచ్చోడిని కొందరు వ్యక్తులు దారుణంగా కొట్టి చంపిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు రూరల్ సిఐ మదుసూధన్‌రెడ్డి, ఎస్ఐ రవికుమార్‌ల కథనం మేరకు... కర్ణాటకరాష్ట్రం చిక్‌బళ్ళాపుర జిల్లా చింతామణి తాలూకా జాతర్లకొత్తకోటకు చెందిన రామయ్యగారి శ్రీనివాసులు(25) రామసముద్రం మండలం వనగానిపల్లి జోగిండ్లు చంద్రకళతో వివాహమయ్యింది. ఈక్రమంలో శ్రీనివాసులు గత కొన్నాళ్ళుగా మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో మండలంలోని మంచినీళ్ళపల్లిలో వైద్యం చేయించేందుకు శ్రీనివాసులు తండ్రి రెడ్డెప్ప మరికొంతమందితో ఆటోలో ఈనెల 25న వచ్చారు. అయితే అతను వైద్యానికి సహకరించకుండా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతోపాటు వెనుతిరిగి వెళుతున్న ఆటోలోంచి దూకి వెళ్ళిపోయాడు. అతన్ని తీసుకొచ్చిన వారు ఇక్కడే విడచిపెట్టి వెళ్ళిపోయారు. కాగా మంచినీళ్ళపల్లి, అంకుతోపల్లిలో శ్రీనివాసులు చేష్టలకు విస్తుపోయిన కొందరు అతనిపై దాడిచేసారు. దాడిలో గాయాలపాలైన అతను ఉదయం అంకుతోపల్లికి సమీపంలోని రోడ్డుపై శవమై కనిపించాడు. అంకుతోటపల్లి వేణు, మహ్మద్దాలిలు తన కుమారుడిని కొట్టి చంపారన్న మృతుని తండ్రి రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ, ఎస్ఐలు వివరించారు. కాగా నిందితులు పరారీలో వున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పుంగనూరు రూరల్ సిఐ మదుసూధన్, ఎస్ఐ రవికుమార్‌లు సందర్శించారు.

## యువకుడి హత్య



శ్రీమృతుడి వద్ద ఏడుస్తున్న భార్య హేమలత

సదుం,పిబ్రవరి26ప్రభాతవార్త
మండల పరిలో ఒక యువకుడి హత్య జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు ఊటుపల్లె పంచాయతీ బొమ్మిరెడ్డి గారిపల్లెకు చెందిన శేషాద్రిరెడ్డి తిరుపతిలో నివశిస్తున్నాడు. అతని పొలంవద్ద పనులు చేయించేందుకు ఆదివారం వచ్చి జేసీబీని పిలుచుకుని వెళ్లాడు. పొలం వద్ద జేసీబీతో పనులు చేయిస్తున్నాడు. ఆసమయంలో ఆదే పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన వి.లక్ష్మయ్య కుమారుడు వి.రవికుమార (40) అక్కడికి వెళ్లాడు. చాలా రోజుల తర్వాత గ్రామానికి వచ్చాడని శేషాద్రిరెడ్డిని ఏమన్నా బాగున్నావా అని అడిగాడు. అప్పటికే మద్యం మత్తులోఉన్న శేషాద్రిరెడ్డి కోపంతో పెద్ద కర్ర తీసుకుని తలపై కొట్టాడు. దీనితో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే పొలాలో ్లని వారు గమనించి రవిని ఆసుపత్రికి తరలిం చాలని ప్రయత్నించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడు. వెంటనే సదుం పోలీసులకు పిర్యాదు చేశారు. సర్పంచి శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ మారుతి సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. శేషాద్రిరెడ్డి పరారిలో ఉన్నాడని రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గొర్రెలు మేపుకుని జీవనం సాగించేవాడు. ఎవరి జోలికి వెళ్లేవాడు కాదు. అతనికి భార్య ఇద్దరు పిల్లలతో పాటు అతనిపై మొత్తం పది మంది ఆధారపడి బ్రతుకుతున్నారు. వారి పరిస్థితి ఏమిటని అందరు గొల్లుమన్నారు.

## ఉత్సవమూర్తులకు షోడషాభిషేకాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13 రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో గ్రామోత్స వంలో పాల్గొన్న స్వామి అమ్మవార్ల ఉత్స వర్లతో పాటు పంచమూ ర్తులు, చంద్రశేఖర త్రిశూలంకు షోడషా భిషేకాలు నిర్వహించారు. ఆలయం లోని అలంకార మండపంలో శాస్త్రోక్తంగా ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, ఆలయ ఇఓ దంపతులు వికె సాగర్‌బాబు దంపతులు హాజరు అయి సంకల్పం చేసారు. అలంకార మండపం లోని పంచమూర్తులకు ఆలయ అలంకార గురుకుల్, శ్రీనివాస గురుకుల్,ఆలయ పారోహితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలను చదువుతుండగా ఆలయ అభిషేక ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథ్న్ గురు కుల్ పూజలు జరిపారు. ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, సూరిగురుకుల్, శ్రీనివాసులు గురుకుల్, దక్షిణమూర్తి స్థానిక సంప్రదాయం ప్రకారం షోడషాభిషేకాలు జరిపి శాంతి చేకూర్చారు. శాంతి అభిషేకంతో ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాయి.ఏర్పాట్లను ఆలయ ఎఇఓ సతీష్ మాలిక్ సారధ్యంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం సూపరింటెండెంట్ నాగభూషణంలు పర్యవేక్షించారు.

# అంతరాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్ల ముఠా అరెస్టు

ముగ్గురు అరెస్టు, పరారీలో ప్రధాన ముద్దాయి
13 దుంగలు, కారు, మోటార్ బైక్ స్వాధీనం



తిరుపతి (క్రైం), ఫిబ్రవరి 26, ప్రభాతవార్త
జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారీగా పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, ముద్దాయి వివరాలను జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఎస్పి ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో యర్రావారిపాలెం పోలీసులకు ఈ నెల 25వ తేది సాయంత్రం 4.30 గంటలకు సమయంలో ఖచ్చితమైన రాబడిన సమాచారం మేరకు భాకరాపేట సిఐ తులసిరాం, యర్రావారిపాలెం సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, భాకరాపేట సబ్ ఇన్స్పెక్టర్ ప్రకాష్ కుమార్, వారి సిబ్బంది తిరుపతి జిల్లా, యర్రావారిపాలెం మండలం, యల్లమంద పంచాయితీ, యల్లమంద - ఉస్తికాయల పెంట రోడ్డులో, యల్లమంద క్రాస్ వద్ద సాదారణ వాహనాల తనిఖీలు చేస్తుండగా వారికి ఒక కారు, ఒక మోటార్ సైకిల్ రైడర్ కదలికలు అనుమాస్పదంగా కనపడడంతో నిలిపి తనిఖీ చేయడానికి ప్రయత్నిస్తుండగా ముద్దాయిలు తప్పించుకోవడానికి ప్రయత్నం చేసారు. వెంటనే అప్రమత్తమైన సిఐ, మిగిలిన సిబ్బంది చాకచక్యంగా వారిని పట్టుకుని విచారించగా పట్టుబడిన వారు అంతరాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్స్ ముఠాకు చెందిన కె. రవికుమార్ (22),, కె. సుధాకర్ అలియాస్ సుధా (24), ఎ. మనివేల్ (24) ముగ్గురు ముద్దాయిలుగా గుర్తించి నిర్దారణ చేసుకుని అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు 21,94,000 రూపాయిలు విలువ గల 13 ఎర్రచందనం దుంగలను, వారు వాడిన వాహనాలు అయిన ఒక కారు, పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, సీజ్ చేయడం జరిగిందన్నారు. పారిపోయిన ప్రధాన ముద్దాయి సత్యరాజ్ రాజేంద్రన్ అతని సభ్యులతో కలిసి ఎర్రచందనం కూలీలను శేషాచలం అడవులకు తీసుకుని వచ్చి, ఎర్రచందనం చెట్లను నరికి, చెన్నై, బెంగళూరులోని బడా స్మగ్లర్లకు దుంగలను సరఫరా చేసేవారిని విచారణలో తేలిందన్నారు. ఇతనిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించి వెతికిస్తున్నామన్నారు. ముఠా వెనుక ఎవరెవరు ఉన్నారో వెలికితీసి, ఎంతటివారినైన వదిలే ప్రసక్తే లేదని, అరెస్టు చేసి కఠిన శిక్ష పడేలాగా చేస్తామని ఎస్పి అన్నారు. ఈ కేసు చేధనలో ప్రాణాలకు తెగించి పనిచేన భాకరాపేట సిఐ తులసి రాం, యర్రావారిపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, భాకరాపేట ఎస్ఐ ప్రకాష్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్‌లు అనిల్ కుమార్, రవికుమార్, ప్రసాద్, హోంగా ర్డులు శ్రీకాంత్ రెడ్డి, ఎం. బాలసుబ్రమణ్యం, పి. బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్‌కు ప్రశంశా పత్రాలు అందజేసి అభినందించి, రివార్డులను ప్రకటించారు.

### ఉష్ణోగ్రతలు
26/2/2023



- తిరుపతి 33 డిగ్రీలు
- చిత్తూరు 34 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల జాతర

30వేల మంది భక్తుల దర్శనం .. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం భక్తుల నిరీక్షణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త
దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. ఆదివారం పూజలు చేయించుకోవటానికి భక్తులు కిట కిట లాడారు.మహాశివరాత్రి ముగిసిన తరువాత మొదటి ఆదివారం కావటంతో దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది.అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబు భక్తుల సదుపాయాల్ని పర్యవేక్షించారు.అలాగే తన సిబ్బందిని సమాయత్త పరచారు.తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎటు చూసినా జనం జనం. ఆలయాధికారుల అంచనాల మేరకు 30వేల మంది దర్శనం చేసుకున్నారు. సోమవారం కూడా రద్దీ ఉండవచ్చుననే భావంతో అధికారులు దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్‌లో పరిశీలించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే జనం. సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజుగా భక్తులు భావిస్తారు.పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పరిసర దేవాలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపధ్యంలో తమిళనాడు, కర్నాటకల సరిహద్దుల్లో ఉన్న 'దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్త జనంతో కిటకిట లాడింది'. కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు సమీపంలోని శాంతి సౌఖ్యాల్ని అందించే ముక్కంటీశుని దర్శనానికి తరలి వస్తున్నారు.తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ల హరియాదవ్, సుదర్శనం,నాగభూషణం, వెంకటముని వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పక్కాగా లా అండ్ అర్డర్

విధి నిర్వహణలో స్వార్ధంగా వ్యవహరిస్తే సస్పెన్షన్
పోలీసు అధికారులతో అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్



చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:
పోలీసులు విధుల నిర్వహణలో పక్కాగా లా అండ్ అర్డర్ అమలు చేసి ప్రజలకు పోలీసు వ్యవస్థపై భరోసా కల్పించాలని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ ఆదేశించారు. అనంతపురం డిఐజి రేంజ్ కార్యాలయం నుండి ఆదివారం డిఐజి రవిప్రకాష్ అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పోలీసు అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిఐజి మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రోడ్లపై బూతులు మాట్లాడటం, తిట్టడం లాంటివి చేయకుండా వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్గించాలన్నారు. ఎక్కడైనా ఎప్పుడైనా అనవసరంగా లాఠీ చార్జీ చేస్తే సహించమని, వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రేంజ్ పరిధిలోని ఎస్పీలు పోలీసు అధికారులు, సిబ్బందితో సెల్ కాన్ఫరెన్స్, జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ప్రజలతో ఎలా మెలగాలి! పోలీసులు చట్టపరంగా ఎలా వ్యవహరించాలి! అనే విషయంపై దిశా నిర్ధేశం చేయాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని రెచ్చగొట్టే ఘటనలు పోలీసులకు ఎదురుకావచ్చునని, పోలీసులు రెచ్చిపోకుండా జాగ్రత్తగా వ్యవహ రించాలన్నారు. పోలీసులు రాజకీయాల జోలికి వెళ్ళకుండా చట్టపరంగా వ్యవహరించాలని, ఎక్కడైనా స్వార్థంతో విధులు నిర్వహిస్తే వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. ఎవరైనా కస్టోడియన్ హింసకు పాల్పడినా, ప్రజలను ఇబ్బంది పెట్టేవిధంగా ప్రవర్తించినా ఊపేక్షించమని స్పష్టం చేశారు. అలాగే నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్, ఎస్‌హెచ్ఆర్‌సి, కోర్టు విషయాలకు సంబంధించి రిప్లైలు సకాలంలో పంపేలా అదనపు ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సెల్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రిశాంత్‌రెడ్డి, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, అనంతపురం ఎస్పీ డాక్టర్ ఫకీరప్ప కాగెవల్లి, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### బంగారం ధరలు
26/2/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,210
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,684

### కోడిగ్రుడ్ల ధరలు
26/2/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

# ఇళ్ళ స్థలాల కబ్జా నిలదీసినందుకు కార్పొరేటర్ దౌర్జన్యం

**చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** సంతపేట ఇందిరమ్మ స్థలాల్లో ఇంటి స్థలాలను కబ్జా చేసి అనర్హులకు విక్రయిస్తుండటంతో నిలదీసినందుకు స్థానిక కార్పొరేటర్ అతని అనుచరుడు చామంతి స్థానికులైన వెంకటేష్, రమేష్‌లపై దాడి చేసి దౌర్జన్యం చేశారు. ఈ మేరకు దాడికి గురై తీవ్ర గాయాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి గురైన స్థానికులు ఆసుపత్రిలో మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇచ్చిందని, అయితే స్థానిక కార్పొరేటర్ అనర్హులకు, బయటి వ్యక్తులకు ఈ స్థలాలను కబ్జా చేసి ఒకొక్క స్థలం 7 లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తనను ఒక నెల రోజుల క్రితం నిలదీసినందుకు తమ కుటుంబంపై కక్ష పెంచుకొన్న అతను సోమవారం తన సోదరుడు వెంకటేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడన్నారు. ఈ విషయం తెలియడంతో స్నేహితుడితో కలిసి తాను ద్విచక్రవాహనంపై సంఘటనా స్థలంకు చేరుకొనే సమయానికి అప్పటికే అక్కడ వేచి వున్న ఓ గుంపు తనపై, తన స్నేహితుడైన రమేష్‌పై దాడి చేశారన్నారు. స్థానికంగా వున్న తమకు ఆ స్థలాలపై హక్కు లేదని అక్కడికి ఎవరెవరో వచ్చి ఎమ్మెల్యే మనుషులమని, మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషులమని చెప్పి బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమకుటుంబంసైతంవైకాపాకు చెందినదేనని అయితేతనపైఅదేపార్టీకిచెందినినేతలుదాడులుచేస్తున్నారనిఆరోపించారు. విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

## ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు మృతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:



చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో ఈ నెల 19వ తేదీన గాండ్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మొగిలివారిపల్లికి చెందిన ఎల్లమ్మ(65) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. వెంటనే చికిత్స నిమిత్తం ఎల్లమ్మను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రమాదేవి ఆసుపత్రికి తీసుకెళ్ళగా శనివారం రాత్రి ఆమె చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతి చెందింది. శవ పరీక్ష నిమిత్తం మృతదేహంను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ దేవర

కుప్పంరూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కుప్పం పట్టణం పాతపేట దోభీఘాట్ వద్ద వెలసిన శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ ఆలయంలో అమ్మవారి దేవర కార్యక్రమంను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు చిన్న గంగమ్మ ఆలయంలోపూజ, గంగపూజ, ఉబ్బదేవరపూజ, పొంగళ్లు, దీపారాధన, బాణవేడుకలు, అన్నదానం, అమ్మవారి జలాధివాసం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## శ్రీప్రియ నర్సింగ్‌హోంచే ఉచిత వైద్య శిబిరం

వి.కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



కుప్పం శ్రీ ప్రియ నర్సింగ్‌హోం అధ్వర్యంలో మండలంలోని ముదరందొడ్డిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంను జడ్పీచైర్మన్ తనయుడు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఛైర్మన్ అమర్‌నాథ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కుప్పం శ్రీ ప్రియ నర్సింగ్ హోం అధినేత, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. ఈసందర్భంగా వివిధ జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్యులు ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదర్, వైస్ ఎంపిపి లక్ష్మణ్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీదేవి ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణరెడ్డి, డా॥ దయాకర్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

**చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవచ్చు.

## వరిగడ్డి దగ్ధం : రూ. 25వేలు ఆస్థినష్టం

చౌడేపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



గడ్డివామి దగ్ధమై రూ. 25వేలు ఆస్థినషం సంభవించిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లి వెంకట్రెడ్డి గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం తర్వాత ముక్కలను గడ్డివామిపై వేసారు. దీంతో వరిగడ్డికి నిప్పంటుకొంది. గుర్తించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసారు. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది సుబ్బరాజు, సుమన్, లోకేష్‌రెడ్డిలు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఇళ్ళ మధ్యలో గడ్డివామి ఉండటం, అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను అదుపు చేయడంతో ఎలాంటి నష్టం వాటిళ్ళలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకొన్నారు.

## వంట గ్యాస్ వినియోగ జాగ్రత్తలపై అవగాహన

యాదమరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

వంట గ్యాస్ వినియోగం, జాగ్రత్తలపై ఆదివారం దసరాపల్లి హరిజనవాడలో యాదమరి శ్రీశివజ్యోతి భారత్ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకులు వరదరాజులు వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉజ్వల్ పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందిన మహిళలకు ఒక సిలెండర్ కొనుగోలుపై ప్రభుత్వం 200 రూపాయల సబ్సిడీ చెల్లిస్తోందన్నారు. ఏజెన్సీల వద్ద పూర్తి డబ్బులు చెల్లించి సిలెండర్ కొనుగోలు చేసుకొన్న వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో 200 రూపాయల జమ చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారులు సేఫ్టీ బుక్‌లెట్లను పంపిణీ చేసి గ్యాస్ వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## నేడు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలు వేలం

చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మూడు వాహనాలను సోమవారం సాయంత్రం 5 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్ ఓ ప్రకటనలో తెలిపారు. 65 వేల రూపాయల విలువైన స్కార్పియో, 3.50 లక్షల రూపాయల విలువైన ఎస్–ప్రెస్సో వాహనం, 22,500 రూపాయల విలువైన క్వాలీస్ వాహనంను వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు 2 వేల రూపాయలు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనవచ్చునన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో పట్టుకొన్న ఓ ద్విచక్రవాహనంను సోమవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మానవత్వం చాటుకున్న జడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



పలమనేరు బైపాస్ రోడ్డులో వాహనం నుంచి వెళ్తూ కింద పడ్డ ఓ కుటుంబాన్ని జడ్పీచైర్మన్ శ్రీనివాసులు తన వాహనంలో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలించి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. స్థానిక బైపాస్ రోడ్‌లో ఆదివారం గంటావూరుకు చెందిన ఓ ముస్లిం కుటుంబం ద్విచక్రవాహనంలో వస్తూ కిందపడ్డారు. అదే మార్గంలో వస్తున్న జడ్పీచైర్మన్ శ్రీనివాసులు తన కారును ఆపి వారిని తనవాహనంలో ప్రభుత్వాస్పత్రి తీసుకెళ్లి వైద్యం చేయించారు. జడ్పీచైర్మన్ శ్రీనివాసులు చూపిన చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలమనేరు పట్టణ కన్వీనర్ ఎస్కెఎస్ జాఫర్ పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్ణయించుకోవాలి

కల్లూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:



ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఏమి చేయాలి అనే విషయాలపై లక్ష్యాలను నిర్ణయించుకోని చదువుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీమతిజ్యోత్స్న అన్నారు. ఆదివారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెనుకబడిన వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు మోటివేషనల్ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా రాబోవు పబ్లిక్ పరీక్షలకు సంసిద్దులు కావడానికి విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు అందించారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఉండాలని తరగతులలో వివరించారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్దంగా విసయాంశాలను నేర్చుకుని మంచి ఉత్తీర్ణత సాదించాలని చెప్పారు. ఉపాధ్యాయ రీసోర్సు పర్సన్‌లు వెంకటసిద్దులు, మోహన్‌క్రిష్ణయ్య, దిల్షాద్‌బేగం, వసతి గృహ సంక్షేమ అధికారులు నవీన్‌కుమార్, సురేష్‌కుమార్‌రెడ్డి, మహేశ్వరిలు పాల్గొన్నారు. ఇందులో సదుం, పులిచెర్ల, కల్లూరు, మంగళంపేట, రొంపిచెర్ల వసతి గృహాల నుంచి 76 మంది విద్యార్థులు హాజరైనారు.

## యువగళం రూట్ మ్యాప్ పరిశీలన

కల్లూరు, ఫిబ్రవరి26ప్రభాతవార్త



పులిచెర్ల మండలంలో మార్చి 3,4 తేదీలలో జరుగు తెదేపా జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ పాద యాత్రకు సంబందించిన ఏర్పాట్లు రూట్ మ్యాప్‌లను ఆదివారం ఆపార్టీ పరిశీలకులుప్రశాంత్‌కుమార్, రవియాదవ్, చంద్ర, శ్రీనివాసులు పరిశీలించారు. పాదయాత్ర తొలి రోజుకొమ్మిరెడ్డిగారిపల్లెనుంచి ప్రారంబమయి, ఎల్లంకివారిపల్లెలో నిర్వహించే బహిరంగసభస్థలిని పరిశీలించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ పాదయాత్ర విజయవంతానికి అందరు సమన్వయంతో కృసి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ నాధంనాయుడు, పులిచెర్ల మండల తెదేపా అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, కార్యదర్శి బండ్లరమేష్, రాజంపేటపార్లమెంటకార్యదర్శులుసుబ్బారెడ్డి, లోకేష్, ఎంపీటీసీలు మునికృష్ణనాయుడు, సిందురవి, నాయ కులుకుమారరెడ్డి, గోపినాయుడు, శేఖర్‌నాయుడు, రవి, పరందామ నాయుడు, అన్నాస్వామిపాల్గొన్నా రు.

## శస్త్రచికిత్సలకు 50 మంది ఎంపిక

కల్లూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతి ఆరబిందో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి పైగా పాల్గొనగా ఆపరేషన్ల కొరకు50 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేవీ చలపతి, ఎంసీఎం రెడ్డెప్ప, దామోదరం, సుధాకరరెడ్డి, కరుణానిధి, శ్రీమతి కేవీ విజయ తిరుపతి రోటరీ క్రియాశాలక సభ్యుడు కుంచా లక్ష్మీపతి, ప్రధానోపాధ్యాయురాలు సుమలత, విరూపాక్ష జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కుంచే ప్రభావతమ్మ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ కుట్టు శిక్షణ కార్యక్రమానికి రెండు మిషన్లను అందజేశారు.

# విద్యాదాత బిసి నాగరాజ్ అందిస్తున్న సేవలు అమోఘం

**- ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి**

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలో బిసిఎన్ విద్యా సంస్థల ఏర్పాటుతో విద్యా దాతగా సంస్థల ఛైర్మన్ బిసి నాగరాజ్ అందిస్తున్న సేవలు అమోఘమని ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బిసిఎన్ గ్రూప్స్‌కు చెందిన కుప్పం పబ్లిక్‌స్కూల్, జూనియర్ కాలేజ్‌ల వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ కుప్పం ప్రాంతం గతంలో వెనుకబడి ఉండేదన్నారు. అయితే తను పుట్టిన ఊరిని గొప్పగా చూడాలనే లక్ష్యంతో బిసి నాగరాజ్ విద్యాసంస్థలు నెలకొల్పి సేవలు అందించడం



పట్ల అభినందించారు. విద్యతోనే గుర్తింపు లభిస్తుందనే విషయం విద్యార్థులు మరువరాదన్నారు. కళాశాల ఛైర్‌పర్సన్ శాంతనాగరాజ్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలు 20వ వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆసియాస్ ట్విన్ జగ్లర్స్ అజయ్, ఆనంద్ చేపట్టిన కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపల్ సుప్రియ, హెచ్ఎం దమయంతి, ఎహెచ్ఎం ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ముమ్మరంగా ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

చిల్లకూరు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



మండలంలోని కమ్మువారిపాళెం గ్రామ సర్పంచ్ మరియు రైతు భరోసా కమీటి అడ్వైజర్ కమీటి సభ్యులు చిట్టేటి నారాయణ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతు మార్చినెల 13 వ తేది జరుగు నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల ఎంఎల్‌సి వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని డిగ్రీ పట్టాపొందిన ఓటర్లను అభ్యర్ధించడం జరిగిందని చెప్పారు. ఇంటింటికి ప్రచారం చేస్తు కరపత్రాలు పంపిణి చేయడం జరిగిందని అన్నారు. వీరి వెంట వైసిపి సీనియర్‌నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మిల్టన్, తదితరులున్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



గూడూరు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థంగా కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో ఆదివారం గాంధీనగర్‌లో 15 మంది ఎస్సీ కుటుంబాలకు 18 రకాల నిత్యా వసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రవికుమార్, రాము, ప్రజేంద్రరెడ్డి, రాధయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ గవర్నర్ సేవలు అభినందనీయం

గూడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



పేదలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ బయ్యా రవికుమార్ సేవలు అభినందనీ యమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరులోని శ్రీసరస్వతి శిశుమందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రవికుమార్ తల్లి బయ్యా సరోజనమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని అన్ని లయన్స్ క్లబ్‌ల ద్వారా వారి సొంత నిధులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. అదేవిధంగా ఆయన తల్లి కిడ్నీ వ్యాధితో మృతిచెందడంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ సెంటర్‌కు రూ.25 లక్షలు విరాళం అందజేశారని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కల్యాణ సాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ వాకాటి రామ్మోహన్, మల్లెమాల మురళీరెడ్డి, శీనయ్య, రూపేష్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, రాధాకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు నిలిచిన డీజిల్ రాయితీ

కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చే డీజిల్ రాయితీ ఈ నెల 16 నుంచి నిలిచిపోయింది. దీంతో డీజిల్ కొనుగోలు చేసేందుకు భారం తప్పడంలేదు. కోట మండలంలో సుమారు 120 మరబోట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కొక్క బోటుకు నెలకు 300 లీటర్లు డీజిల్‌ను రాయితీపై అందిస్తుంది. లీటరుకు రూ.9 ఇస్తుంది. మిగతా మొత్తం బోటు యజమాని భరించాలి. ఈ రాయితీ ఏ నెలకానెలలోనే వినియోగించాల్సి ఉంది. ఈ నెల ముగిసేందుకు మరో రెండురోజులే గడువు ఉందని, ఈలోపు రాయితీని పునరుద్ధరించాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ సమస్యను మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక కారణాలతో నిలిచిందని చెప్తున్నారని, సమస్య పరిష్కరించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ విషయంపై మత్స్యశాఖ ఎడి నాయక్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, సాంకేతిక కారణాలతోనే ఈ నెల 16 నుంచి డీజిల్‌పై రాయితీ అందడం లేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెండురోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

# ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యం

**- మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**

గూడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు టిడిపి కార్యాలయంలో ఆయన గ్రామాల వారీగా పట్టభద్రుల ఓటర్ల జాబితా, ప్రచారం, పోలింగ్ తదితర విషయాపై సమావేశంలో చర్చించారు. గూడూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిరణ్‌కుమార్ టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరిగా ఎంపిక కావడంతో ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గోడపత్రికలను నాయకులు, కార్యకర్తలు విడుదల చేసి



క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి సోమవారం నుంచి ప్రతి వార్డులో, గ్రామంలో ఉధృతంగా ప్రచారం చేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివా సులు, పార్లమెంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయిల్‌కుమార్, పట్టణ కార్యదర్శి నిమ్మకాయల నరసింహులు, మాజీ కౌన్సిలర్ వాటంబేటి శివకుమార్, పార్లమెంట్ కార్యదర్శి యనమల దినేష్, పార్లమెంట్ బిసిసెల్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్‌రహీమ్, పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, గూడూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ సరస్వ తమ్మ, ఎస్సీసెల్ నియోజకవర్గ పట్టణ అధ్యక్షులు ఏసుపాక పెంచల య్య, పల్లి కోటేశ్వరరావు, బిసిసెల్ పట్టణ అధ్యక్షులు రావుల శివప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్‌చే రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, మజ్జిల ప్యాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జోన్ ఛైర్మన్ సాయిరాం ఫ్రెండ్లీ విజిట్ సందర్భంగా ఈ ప్రక్రియను చేపట్టారు. అనంతరం పట్టణంలోని గోశాలకు వెళ్లి గోవులకు దాణాను అందజేశారు. వాసవి ఆలంబన పథకం కింద నెలవారీ పెన్షన్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్‌కు చెందిన సునీత, కళావతి, శైలజ, పద్మిని, నిర్మల, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు సిఐ ప్రతిభ అభినందనీయం

గూడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



గూడూరు రూరల్ సిఐ దశరధరామారావును తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ పరమేశ్వరరెడ్డి గూడూరు రూరల్ సిఐని ప్రత్యేకంగా అభినందించారు. గూడూరు రూరల్ స్టేషన్‌లో విధుల్లో చేరినప్పటి నుంచి ప్రజల మన్ననలు అందుకున్నారు. ఎక్కడ క్రైమ్ జరిగినా వెంటనే ఛేదిస్తూ ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రతపై ప్రతి వారం మహిళా పోలీసులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గూడూరు రూరల్‌లో అత్యధికంగా కేసులను రాజీ చేయడంలో ప్రతిభ కనబరిచినందుకు జిల్లాఎస్పీ పరమేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. రూరల్ పిఎస్ హెచ్‌సి శ్రీనివాసరెడ్డి, చిల్లకూరు పిఎస్ పిసి విష్ణు, హెచ్‌సి కస్తూరయ్య తదితరులను అభినందించారు.

## వాహనాలపై పోలీసుల దాడులు

కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కోట, విద్యానగర్‌లలో ఆదివారం ఎస్ఐ జి.పుల్లారావు తమ సిబ్బందితో పలు వాహనాలపై దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. పలు వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ఎస్ఐ కోట సెంటర్‌లో వాహనాలు తనిఖీలు చేస్తున్నారని తెలుసుకున్న వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లడం కనిపించింది.

## సుధీర్ కుటుంబానికి పలువురు పరామర్శ

కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కోట పట్టణానికి చెందిన బిజెపి నాయకుడు సేనాతి సుధీర్‌నాయుడు సతీమణి పూర్ణిమ ఆదివారం కన్నుమూశారు. సేనాతి సుధీర్‌నాయుడు తొలుత తెలుగుదేశం పార్టీలో దివంగత మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాదరావుకు అనుచరుడిగా ఉండేవారు. అనంతరం ఆయన బిజెపిలో చేరారు. సుధీర్‌నాయుడును పలువురు నాయకులు పరామర్శించారు.

## వీధి శునకం.. కరిస్తే నరకం



**- భయపడుతున్న ప్రజలు**

ఓజిలి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఓజిలి మండలంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. పిక్కలు పీకుతూ ప్రాణాపాయ స్థితిని కలిగిస్తున్నాయి. రాత్రివేళల్లో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఓజిలి మండలంలోని మూరికివాడలు, పంచాయతీల్లోని శివారు కాలనీల్లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. చిన్నపిల్లలను అదునుచూసి వెంటాడుతున్నాయి. వారి చేతుల్లోని ఆహారం లాగేసుకుంటున్నాయి. ప్రజలకు ప్రాణాపాయంగా మారిన కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి. కుక్కల బారిన పడిన బాధితులు టీకాల కోసం ప్రభుత్వాసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఒక నెలలో సగటున 50 నుంచి వంద మంది వరకు కుక్క కాటుకు గురవుతున్నారు. ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో కుక్కకాటుకు వైద్యం చేయించుకుంటున్నారు. కుక్కలను అరికట్టేందుకు చర్యలు చేపట్టడం లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పిడిఎస్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించండి

**- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు**

గూడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

గూడూరులోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ప్రజాసంఘాల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశం ఎ. మంజులమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు వందివాసి నాగరాజు మాట్లాడుతూ ఓటర్లను సమీకరించడం, దొంగ ఓట్లను అరికట్టడం చేయాలన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులు గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని,



పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని కోరారు. అధికారులు ఎన్నికలను పారదర్శకంగా జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు పద్మలీల, తిరుపతి జిల్లా శ్రామిక మహిళా నాయకురాలు ఆర్.లక్ష్మి, చిల్లకూరుఇందిరమ్మ, బాలాయపల్లి స్వరూపారాణి, గూడూరు ప్రభావతి, వాకాడు సరోజిని, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, లడపాల ప్రసాద్, ఎస్.సురేష్, ఎస్.ముత్యాలయ్య, బివి రమణయ్య, బి.చంద్రయ్య, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

